ఖాళీస్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

- మురికి కూపాలుగా ఖాళీ స్థలాలు
- దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



రాయికల్ పట్టణంలోని ఖాళీ ప్రదేశంలో పిచ్చిమొక్కలు

రాయికల్: పట్టణంలో ఖాళీస్థలాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. రాయికల్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తర్వాత స్థలాలకు భారీగా డిమాండ్ పెరగడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు బల్దియాలో స్థలాలు కొనుగోలు చేసి వదిలివేశారు. దీంతో ఆయా స్థలాల్లో చెట్లు పెరిగిపోతున్నాయి. ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం, డ్రెయినేజీలోకి చేరడంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణంలోని భీమన్నవాడ, కేశవనగర్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, మాదిగకుంట, కోరుట్ల క్రాసింగ్ రోడ్ తదితర కాలనీల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విష పురుగులు, పాములు తిరుగుతున్నాయి. అపరిశుభ్రంగా ఉన్న స్థలాలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ

స్థల యజమానులు ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. కానీ కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకుని వదిలేస్తున్నారు. దీంతో ఆ స్థలాలు మురికికూపాలుగా మారుతున్నాయి. సంబంధిత యజమానులకు అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికీ పట్టణంలో కొందరి వివరాలు తెలియక మున్సిపల్ అధికారులు నోటీసులు సైతం ఇవ్వడం లేదు. ఖాళీ స్థలం పన్ను సైతం చెల్లించాల్సి ఉంటుంది. అసలు బల్దియా పరిధిలో ఎన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయో మున్సిపల్ అధికారుల వద్ద వివరాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రం చేసే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం



పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల్లో యజమానులు వారి స్థలాలను పరిశుభ్రంగా లేకపోతే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి పన్ను వసూలు చేస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

క్రిబ్‌కో జనరల్ బాడీ సభ్యుల నియామకం



సభ్యులను అభినందిస్తున్న రామకృష్ణయ్య

జగిత్యాలరూరల్: క్రిబ్‌కో ఎరువుల కంపెనీ రిప్రజెంటీవ్ జనరల్ బాడీ సభ్యులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఐదుగురు సహకార సంఘాల చైర్మన్లు ఎంపికయ్యారు. గంబీరావుపేట చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పొరండ్ల సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, అల్లీపూర్ చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, చొప్పదండి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కల్లెడ చైర్మన్ అన్నమనేని సందీప్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మంగళవారం క్రిబ్‌కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య అభినందించారు.

మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

కోరుట్ల: ప్రకృతికి హాని కలగకుండా ఉండేందుకు మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ దివాళి-శుభ్ దివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ దుర్గా మహిళా సమాఖ్య సభ్యులు మట్టి దీపాల స్టాల్ ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేశ్, మెప్మా సీఈవోలు సంధ్య, గంగమణి, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క, విప్ అడ్లూరి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: మండలంలోని కీచులాటపల్లి నుంచి మల్లాపూర్, ఏడుమోటలపల్లి నుంచి పెగడపల్లికి బీటీ రోడ్లకు సీఆర్ఆర్ గ్రాంట్ నుంచి రూ. 10 కోట్లు మంజూరు కావడం పట్ల రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కీచులాటపల్లిలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నిధుల మంజూరు కృషి చేసిన అడ్లూరికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు రవి, రవినాయక్, అంజయ్య, నాయకులు విజయభాస్కర్, మల్లారెడ్డి, దుర్గయ్య, అనిల్, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింహులు, కిషన్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి

రాయికల్: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో మమత కోరారు. మంగళవారం మండలంలోని కిష్టంపేట అంగన్‌వాడీ కేంద్రానికి జగిత్యాల క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ విద్యార్థులకు కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మమత మాట్లాడుతూ అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేస్తున్న జగిత్యాల క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ హెడ్ రమేశ్ బాబు, బ్యాంక్ మేనేజర్ గణేశ్, ఏరియా మేనేజర్ అంకుస్, ఫీల్డ్ ఆఫీసర్ రంజిత్, జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ రాధ, కార్యదర్శి వేణు, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలి

పెగడపల్లి: మండలంలో త్వరలో ప్రభుత్వ పరంగా వివిధ అంశాలపై చేపట్టనున్న సర్వేపై పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)పై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన కోసం ప్రణాళిక శాఖ ప్రత్యేక ఫార్మాట్ తయారు చేసిందన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లను కేటాయించనున్నట్లు, సర్వే ప్రారంభించిన తరువాత 20 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన వాసం రాజయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.31 వేల విలువగల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుంటి రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైస్తవులకు కమ్యూనిటీహాల్, శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని వినతి

జగిత్యాల పట్టణం, అర్బన్ మండలంలోని క్రైస్తవులకు కమ్యూనిటిహాల్, శ్మశానవాటిక స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని, గత ఏడాది పట్టణ శివారులోని టీఆర్‌నగర్‌లో సర్వేనంబరు 437లో మైనార్టీలకు 10.10 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ ఆర్.జీవరత్నం, ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.బెంజిమెన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెస్లీ, కోశాధికారి అశోక్‌పాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఆర్ఆర్ కాలనీవాసులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కాలనీవాసులు ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. 25వ వార్డు తులసినగర్‌లో నూతనంగా ఏర్పడిన ఎస్ఆర్ఆర్ నగర్ కాలనీకి చెందిన దాదాపు 40కుటుంబాలు తమ కాలనీలో పలు అభివృద్ధి పనుల అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొల్లంపల్లి సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కొత్తకొండ భూమాగౌడ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సారెడ్డి

కోరుట్ల రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని యెఖీన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి అన్నారు. పీఏసీఎస్ పరిధిలో యెఖీన్‌పూర్, కోరుట్ల అల్లమయ్య గుట్ట వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చేపూరి జీవన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాశిరెడ్డి మోహన్ రెడ్డి, సీఈవో తాజొద్దీన్ బాబా, సహకార శాఖ జేఏ భాగ్య, పుటుకపు నర్సారెడ్డి, వరికంటి సాగర్, మ్యాదరి రాజం, డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం కోరారు. మండలంలోని ఇటిక్యాల, కట్కాపూర్, అల్యానాయక్‌తండా, తాట్లవాయి గ్రామాల్లో మంగళవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం చక్రవర్తి, సీసీలు గంగమణి పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



వేడుకల్లో వైద్యాధికారులు, సిబ్బంది

కథలాపూర్: ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రవీందర్ అన్నారు. మంగళవారం ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని ఆన్‌లైన్ ద్వారా వైద్యసిబ్బందితో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వీక్షించారు. దేశంలో ఆయుర్వేద వైద్యం వల్ల ప్రజలకు జరిగే మంచిని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సింధూజ, రజిత, సూపర్‌వైజర్లు మురళి, శ్రీధర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: ధన్వంతరి జయంతి వేడుకలు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, ఆయుర్వేద వైద్యాధికారి రజిత, సూపర్‌వైజర్ శ్రీధర్, విజయ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతి వేడుకలను పట్టణంలో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చిట్యాల సత్యనారాయణ, సమ్మెట రాజేశ్, ముత్యాల రమేశ్, భూమయ్య, కొర్లెపు శ్రావణ్ పాల్గొన్నారు.

డీఎస్పీకి అంబేడ్కర్ సంఘం నాయకుల సన్మానం

జగిత్యాలక్రైం: జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట అవార్డు ప్రకటించగా మంగళవారం ఆలిండియా అంబేడ్కర్ సంఘం నాయకులు డీఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్లశ్యామ్, నక్క విజయ్‌కుమార్, కాళ్ల సత్తయ్య, కాంపల్లి గంగాధర్, దూలూరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ నాయకులకు..

ధర్మపురి: మండలానికి చెందిన పలువురు బీసీ నాయకులు వివిధ పదవులు పొందగా, వారిని బీసీ సంఘం ఆధ్వర్యంలో ధర్మపురిలో మంగళవారం సన్మానించారు. ముందుగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సంఘం నర్సింహులు, మున్నూరుకాపు సంఘం జిల్లా కోశాధికారి కుంట సుధాకర్, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కొంక సుధీర్, ఉపాధ్యక్షుడు వెలుగందుల అనిల్, ప్రధానకార్యదర్శి బోగ మల్లేశ్, కోశాధికారి బైరి మల్లేశ్, సంయుక్త కార్యదర్శి బుర్ర సుమన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్, గడ్డం సత్యనారాయణరెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్, నక్క రాజేందర్ పాల్గొన్నారు.

వైద్యుడికి ..

జగిత్యాలరూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ గురువారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-2 ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కాగా, మంగళవారం లింగంపేట గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, మహేశ్, రాజు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు..

వెల్గటూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందికి మంగళవారం వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సేవలు కొనియాడుతూ జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం నందయ్య, దోరిశెట్టి వెంకటయ్య పద్మలత, కొండల్‌రెడ్డి, సీఆర్పీ వైద్య వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: మున్సిపల్ నాలాలు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 18 వార్డు కౌన్సిలర్ చెట్లపల్లి మీనా మాట్లాడుతూ పలు చోట్ల నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వీటిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో మొత్తం ఏడు అంశాలను ప్రవేశపెట్టగా, వాటికి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం పదవీ విరమణ చేసిన పారిశుద్ధ్య కార్మికురాలు గంగును కౌన్సిలర్లు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి రాధారాణి, హెచ్‌ఈవో రమేశ్, సూపర్‌వైజర్ ధనుంజయ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ పరామర్శ

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త మాజీ ఎంపీటీసీ బోర్లకుంట రాజయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుముఖ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు డీఏలైనా మంజూరు చేయాలి

జగిత్యాల: డీఏలపై చేసిన ప్రకటనను సమీక్షించి కనీసం మూడు డీఏలైనా మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ అన్నారు. మంగళవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ మండలాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. డీఏ ప్రకటన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. ఆర్థిక పరిస్థితులను కారణంగా చూపుతూ డీఏలు, పీఆర్సీ వంటి వాటిని ప్రకటించకుండా వాయిదా వేయడం ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంచంద్రం, నాయకులు రఘుపతి, చంద్రశేఖర్, గోవర్దన్, ఫక్రొద్దీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి

బుగ్గారం: పెండింగ్‌లో ఉన్న డీఏ లను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని అమలు చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్ అన్నారు. మండల తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. చాలాకాలం నుంచి ప్రభుత్వం బకాయిలు పడ్డ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు తిరునగరి ప్రకాష్, బి.శ్రీలత, శ్రీధర్, రవిప్రసాద్, లచ్చన్న, అరుణ్‌కుమార్, సతీశ్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం

- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్‌లో శ్రీలక్ష్మీనరసింహా వైన్స్‌లో జరుగుతున్న దోపిడీ గురించి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తగిన చర్యలు చేపట్టాలంటూ ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు చేసినప్పటికీ మంగళవారం కూడా గోపులాపూర్ వైన్స్‌లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరిపారని జగిత్యాల జిల్లా టీజేఎస్ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. దీనికి ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు.మద్యం బాటిళ్లకు స్టిక్కర్లు వేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక ఎక్సైజ్ అధికారులను సంప్రదించగా సరైన స్పందన లేదన్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేసి చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేయడం సరికాదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నంలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌కు మండల పంచాయతీ కార్యదర్శులు విన్నవించారు. పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా ఏడాది పూర్తి చేసుకున్న కార్యదర్శులను ప్రొబేషన్ పీరియడ్ డిక్లేర్ చేయాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లేని గ్రామపంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్యదర్శుల కుటుంబాలకు రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కారుణ్య నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెగడపల్లి: దీర్ఘకాలంగా పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయవంతం చేయుటలో కీలకపాత్ర పోషించిన పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కార్యాచరణ ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు న దీం, కార్యర్శులు నిఖిల్‌రెడ్డి, పద్మ, కిరణ్, మధు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు తీర్చాలని మల్లాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించాలని, 18 నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిదులు రాకపోవడంతో నిర్వహణ ఇబ్బంది అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంశీదర్‌రెడ్డి, ప్రదాన కార్యదర్శి అందె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గుడి నిర్మాణానికి విరాళం

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెం పల్లగుట్టపై నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణానికి బొబ్బల నరేశ్ రూ. 1,11,111 విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ బాధ్యులు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తెలు నరేశ్, కట్కామ్ రమేశ్, హనుమండ్ల సతీశ్, కొండ కిషన్, తేలు రాజేందర్, రవీందర్ రావు, నర్సింగరావు, దాసరి పరంధాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజ సేవలో యువత ముందుండాలి

పెగడపల్లి: సమాజ సేవలో యువత ముందుండాలని ఎస్సై రవికిరణ్ అన్నారు. పోలీసుల అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మండలంలోని పలు గ్రామాల యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన వారికి పోలీసులు సర్టిఫికెట్లు అందజేశారు. కానిస్టేబుల్ సంపత్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను సద్వినియోగించుకోవాలి

కథలాపూర్: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగించుకోవాలని ఎంపీవో రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్ మండలం సిరికొండలో ఉపాధిహామీ పథకం గ్రామసభ నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. రూ. 2.79 కోట్ల పనులు గుర్తించాలని ప్రణాళిక తయారు చేశారు. కార్యక్రమంలో ఏపీవో రాజేందర్, టీఏ శ్రీధర్, కార్యదర్శి నర్సారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాల: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. మంగళవారం జగిత్యాల మండలం కండ్లపల్లిలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్ అనిత, సెక్రటరి ప్రవీణ్ పాల్గొన్నారు.

మద్దులపల్లిలో పశువైద్య శిబిరం

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి ఆధ్వర్యంలో గోపాలమిత్రలు మంగళవారం ఫర్టిలిటీ క్యాంపు నిర్వహించారు. పశువులకు గర్భధారణ, చూడి పరీక్ష, గర్భకోశ వ్యాధి నివారణ, సాధారణ వ్యాధుల నివారణకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పశువైద్యాధికారి హేమలత, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎండీ షాదుల్లా, వీఏ మతిన్, గోపాలమిత్రలు, నాయకులు పాల్గొన్నారు.

హార్డ్ కాపీలు ఇవ్వాలి

జగిత్యాల: జిల్లాలోని గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలు 2017-18 నుంచి 2021-22 వరకు ఫ్రెష్, రెన్యువల్ యుటిలైజేషన్ సర్టిఫికెట్ల దరఖాస్తులను వెరిఫికేషన్ పూర్తి చేసి హార్డ్‌కాపీలను గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయం కరీంనగర్‌లో ఇవ్వాలని జగిత్యాల గిరిజనాభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తులు ఇవ్వకపోతే స్కాలర్‌షిప్‌లు మంజూరు కావని, ప్రిన్సిపల్స్ అందరూ పంపించేలా చూడాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 9502664044 సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో పోటీల నిర్వహణ

మేడిపల్లి: మండలంలోని వల్లంపల్లి గ్రామంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ -14 వ ఖోఖో పోటీలు(బాలురు, బాలికలు) నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్మ నవీన్ తెలిపారు. ఈ పోటీల్లో జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ట్రెస్ రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా ప్రశాంత్‌కుమార్

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దేవళ్ల ప్రశాంత్‌కుమార్ తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయుల అసోసియేషన్ ముఖ్య సలహాదారుడిగా ఎన్నికయ్యారు. ప్రశాంత్ కుమార్ గతంలో ట్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

నిజాయితీ చాటుకున్న రైతు దేవయ్య

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామంలో ఓ రైతు తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను పొగొట్టుకున్న వ్యక్తికి మంగళవారం అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... భూషణరావుపేట గ్రామానికి చెందిన తీట్ల శంకర్ ఇంట్లో జరిగిన వేడుకలకు బీమారం మండలం మన్నెగూడెంకు చెందిన ఉమ్మడి మనోజ్ హాజరయ్యారు. మనోజ్ సెల్‌ఫోన్ ఈనెల 27న రాత్రి జేబులో నుంచి పడిపోయింది. ఈ సెల్‌ఫోన్ మంగళవారం ఉదయం భూషణరావుపేట గ్రామానికి చెందిన రైతు భూపతి దేవయ్యకు దొరికింది. ఈ విషయం తెలుసుకున్న దేవయ్య సెల్‌ఫోన్‌ను తీట్ల శంకర్‌కు అప్పగించారు. దేవయ్యను గ్రామస్తులు అభినందించారు.

పోలీసు సిబ్బందికి సరెండర్ లీవ్ బడ్జెట్ విడుదల

జగిత్యాలక్రైం: రాష్ట్రంలో పోలీసు సిబ్బందికి సరెండర్ లీవ్‌లు బకాయిలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం 182.48 కోట్లు విడుదల చేయగా పోలీసు అధికారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. పోలీసు శాఖకు రావాల్సిన మిగతా బకాయిలు దశల వారిగా త్వరగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

31న ధనలక్ష్మి, 1న కేదారేశ్వర పూజలు

కోరుట్ల: దీపావళి సందర్భంగా ఈ నెల 31 గురువారం ధనలక్ష్మి పూజలు, నవంబర్ 1న కేదారేశ్వర పూజలు నిర్వహించుకోవాలని కోరుట్ల బ్రాహ్మణ సేవా పరిషత్ అధ్యక్షుడు పాలెపు రాము శర్మ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కలకుంట్ల నితిన్, కోశాధికారి దండంరాజ్ స్వరాజ్, బ్రహ్మన్న గారి కిషన్ శర్మ, అరుణ్ శర్మ, పాల్గొన్నారు.

నేడు ఇబ్రహీంపట్నంలో సివిల్స్ రైట్స్ డే

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఎస్సీ వాడలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉదయం సివిల్స్ రైట్స్ డేను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొనాలని ఆయన తెలిపారు.